ఆంధ్రజ్యోతి హైదరాబాద్ | సోమవారం 1 ఆగస్టు 2011

# ఆధార్‌ను బహిష్కరిద్దాం!

• స్వచ్ఛంద సంస్థల పిలుపు

హైదరాబాద్, జూలై 31 (ఆన్‌లైన్, సిటీబ్యూరో): ''పౌరహక్కులకు భంగం కలిగించి, పేదలకు ప్రతిఫలాలు దక్కకుండా చేసే ఆధార్ ఎందుకు? ప్రజలకు ఆధారం కానీ ఈ 'ఆధార్'ను బహిష్కరిద్దాం'' అని పలు స్వచ్ఛంద సంస్థలు పిలుపునిచ్చాయి. ఆధార్ వల్ల ఎవరికీ ప్రయోజనం లేనప్పుడు కోట్ల రూపాయలు ఈ ప్రాజెక్టు కోసం వెచ్చించడం అనవసరమని అభిప్రాయపడ్డాయి. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ, నేషనల్ అలయెన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్‌మెంట్స్, హ్యూమన్ రైట్స్ లా నెట్ వర్క్, ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక తదితర సంస్థలు అధార్ వల్ల కలుగుతున్న ఇబ్బందులను వివరించడానికి ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశాయి. ఆధార్ (యూఐడీ)పై ఓపెన్ ఫోరం నిర్వహించామని, ఇందులో చాలా మంది దీనిని వ్యతిరేకించారని ఆ సంస్థల ప్రతినిధులు వివరించారు. దీనిని బహిష్కరించాలని చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేశారని వారు చెప్పారు. ఆమోద యోగ్యమైన న్యాయసూత్రాలకు, రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు యూఐడీ ప్రాజెక్టు వ్యతిరేకమని డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ సతీష్ వివరించారు. అధార్‌ను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అధార్ వస్తే మరిన్ని ప్రయోజనాలు, పథకాలు పేదలకు దరిచేరుతాయనదే అపోహ మాత్రమేనని ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక జాయింట్ కన్వీనర్ సరస్వతి పేర్కొన్నారు. ఈ అధార్ వల్ల మానవులను ఒక సంఖ్యగా మార్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.